క్లుప్తంగా

పర్యావరణానికి మొక్కలే మణిహారం


మొక్కలు నాటుతున్న బెహరా విద్యాసంస్థల కార్యదర్శి బెహరా చైతన్య

పెందుర్తి: పర్యావరణానికి మొక్కలే మణిహారంగా నిలుస్తాయని బెహరా విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ బెహరా చైతన్య అన్నారు. నరవలోని బెహరా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో 'హరిత వనం' కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. పచ్చదనం పెంపొందించడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బాణాల తరుణ్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పట్నాయక్, గోవిందరాజులు, డాక్టర్ రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


అదృశ్యమైన అర్జున

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ దేముడు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా వేపాడ కె.ఆర్ పేటకు చెందిన బూడి అర్జున, భార్య ఇందుతో కలిసి చీమలాపల్లిలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. అర్జున ఆటో నడుపుతుంటాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈ నెల 5న ఇంటి నుంచి ఆటోతో వెళ్లిన అర్జున తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో అర్జున భార్య ఇందు పోలీసులను ఆశ్రయించింది. సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు


ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని ఆరిపాక ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ చిన్నికృష్ణ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది ఆరిపాకలోని సర్వే నంబర్ 84లో శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఇటీవల కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించినా.. హెచ్చరిక బోర్డులు తొలగించినా కఠిన చర్యలు తీసుకుంటామని వీఆర్వో అప్పలరాజు, వీఆర్ఏ నరసింగరావు హెచ్చరించారు.

పోలీస్ సీజ్డ్ వాహనాల లెక్కలు పూర్తి


డంపింగ్ యార్డులో పోలీస్ సీజ్డ్ వాహనాలు

మధురవాడ: వివిధ పోలీసు కేసుల్లో సీజ్ చేసి మధురవాడ శివశక్తినగర్ రోడ్డులో రైతుబజార్ పక్కన ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో పడేసిన వాహనాల సంఖ్య 2,300గా అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. రెండు రోజులుగా చేపడుతున్న లెక్కింపు కార్యక్రమం శనివారం సాయంత్రానికి కొలిక్కి వచ్చింది. ఇక్కడ ఉన్న రెండు, మూడు, నాలుగ చక్రాలు వాహనాలు అన్నీ కలిపి 2,300 ఇక్కడ ఉన్నట్టు తేల్చారు. అయితే అధికార యంత్రాంగం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇక్కడ క్రైం డీసీపీ లతామాధురి పర్యవేక్షణలో ఏసీసీపీ మోహనరావు, ఏసీపీలు ఎ. వెంకటరావు, లక్ష్మణరావు, పీఎం పాలెం క్రైం ఇన్‌స్పెక్టర్ వీఎస్ఎస్ ప్రకాశ్ ఆధ్వర్యంలో నగరంలోని 22 క్రైం పోలీస్ స్టేషన్ల పరిధిలో 8మంది సీఐలు, 20మంది ఎస్‌ఐలు వాహనాల లెక్కింపు పనులు చేపట్టారు.

సాగు..బాగు

- కోతకు సిద్ధమైన వరి పంట
- నీటి ఎద్దడి ఉన్నా.. వ్యయప్రయాసలకోర్చి పంటను నిలబెట్టుకున్న రైతన్నలు
- దాదాపు 5 వేల ఎకరాల్లో పక్వానికి పంట
- మరో వారం, పది రోజుల్లో కోతలు ప్రారంభం


కోతకు సిద్ధంగా వరికంకులు


కోతకు సిద్ధమైన వరి పంట

పెందుర్తి: పెద్ద పండగకు కొత్త బియ్యంతో వంటలకు రైతన్న సిద్ధంగా ఉన్నాడు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ అన్నదాతను నిలబెట్టింది. తొలకరి నుంచి వరినాట్లు వేసే వరకు వర్షాభావం ఉన్నా.. కష్టనష్టాలకోర్చి రైతులు పంట 'పండి'ంచుకున్నారు. అడుగడుగునా చీడలు పంటను పీడిస్తున్నా తట్టుకుని 'సాగును బాగు' చేసుకున్నారు. మొత్తానికి నియోజకవర్గంలో సుమారు 5,180 వేల ఎకరాల్లో వరి పంట కోతకు సిద్ధమైంది. ప్రకృతి సహకరించి, అంతా సవ్యంగా సాగితే మరో వారం పదిరోజుల్లో పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలాల్లో ముమ్మరంగా వరి కోతలు ప్రారంభం కానున్నాయి.

అడుగడుగునా ఇబ్బందులే.. అయినా..

పెందుర్తి మండలంలో 1555 ఎకరాలు, సబ్బవరంలో 3,300 ఎకరాలు, పరవాడలో దాదాపు 325 ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు. అయితే ఖరీఫ్ తొలినాళ్లలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఓ దశలో అయితే వరినాట్లు వేయడం కూడా సాధ్యమేనా అన్నట్లుగా ఉంది. అయితే జూలై, ఆగస్టు మాసాల్లో అడపాదడపా తుపాన్లు రావడం, వరినాట్లు వేసేందుకు వీలుగా వర్షాలు పడ్డాయి. ఆ తరువాత కొన్నాళ్లు వాతావరణం సహకరించినా ఇటీవల పంట పాలు పోసుకుంటున్న సమయంలో మరోసారి తీవ్ర వర్షాభావం ఏర్పడింది. దీంతో రైతులు తీవ్ర వ్యయప్రయాసలకోర్చి చేనుకు పెట్రోల్/డీజిల్ మోటార్ల ద్వారా నీరు అందించి పంటను నిలబెట్టుకున్నారు. ఈ క్రమంలో మరో పక్షం రోజుల్లో ఫలసాయం పొలం నుంచి రైతు కల్లాలకు చేరనుంది. దీంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

చాలా ఆందోళన పడ్డాం



ఈ సీజన్ అంతా వర్షాలు సరిగా పడకపోవడంతో ఇబ్బంది పడ్డాం. పంటకు తడి కోసం ఎక్కువ సమయం మోటార్లకే కేటాయించాల్సి వచ్చింది. పంట వ్యయం అనుకున్న దానికంటే అధికంగా అయింది. అయినా పంటను మాత్రం నిలబెట్టుకోగలిగాం. ఎన్ని బాధలు పడినా పంట చేతికి వస్తే ఆ సంతోషమే వేరు. మరో వారంలో కోతలు ప్రారంభిస్తాం.

– శ్రీనివాసరావు, తవ్వవానిపాలెం, సబ్బవరం

మంచి ఫలసాయమే వస్తుంది



ఈ సీజన్‌లో రైతులు మంచి వరి వంగడాలనే ఎంచుకున్నారు. మేం కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి సలహాలు అందించాం. వాతావరణం కూడా పెద్దగా ఇబ్బంది పెట్టకపోవడంతో ప్రస్తుతానికి పంట కోతల దశకు వచ్చింది. అంతా బాగుంటే రైతులకు ఈ ఏడాది మంచి ఫలసాయమే వస్తుంది. పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కూడా తగిన ఏర్పాట్లు చేసింది.

– టి.దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారి, పెందుర్తి

అప్పలరాజుకు అదీప్‌రాజ్ పరామర్శ


గాయపడిన అప్పలరాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సర్వసిద్ధి అప్పలరాజును మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం పరామర్శించారు. 88వ వార్డు పరిధి వెదుళ్లనరవలోని అప్పలరాజు నివాసానికి పార్టీ సీనియర్ నాయకులతో కలిసి వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గండ్రెడ్డి మహలక్ష్మి నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు దాడి సూరకరాజు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, కోటాన రాము, సర్పంచ్‌లు మోపాడ అప్పారావు, వడ్డాది అప్పలరాజు, దనిమిరెడ్డి శ్రీనివాసరావు, పెందుర్తి వైస్ ఎంపీపీ చిరికి దేముడు, సర్వసిద్ధి బోరయ్య తదితరులున్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ, చిత్రంలో సీఐ మల్లికార్జునరావు

పరవాడ: ఓ మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ఓ యువకుడిని పరవాడ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పరవాడ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతానికి చెందిన మైనర్ బాలిక(15) పరవాడలోని తన సోదరి ఇంటికి ఇటీవల వచ్చింది. ఈ క్రమంలో పరవాడ ప్రాంతానికి చెందిన ఓ యువకుడి(30)తో పరిచయం ఏర్పడింది(ఇద్దరూ ఒకే షాప్‌లో పనిచేస్తున్నారు). ఈ క్రమంలో బాలికపై సదరు యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక సోదరి ఫిర్యాదు మేరకు సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేసి నిందితుడ్ని శనివారం పట్టుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో సీఐ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి వీవోఏ సభ్యుల సాయం


చిన్నా కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న ఏపీఎం రంగారావు తదితరులు

పరవాడ: అనారోగ్యంతో బాధపడుతున్న పరవాడ బోంకుల దిబ్బకు చెందిన చిన్నా వైద్య సహాయానికి వీవోఏల సభ్యులు రూ.1.04 లక్షలు సాయాన్ని అందించారు. బోంకుల దిబ్బకు చెందిన సూకాంబిక ఎస్‌హెచ్‌జీ సభ్యురాలైన నక్కెర్ల లక్ష్మీ, భర్త దేముడు నాయుడుల కుమారుడు నక్కెళ్ల చిన్న (22) కొంత కాలంగా గుండె సబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో పరవాడ బోంకుల దిబ్బకు చెందిన వీవోఏ-1 పోతల రమాదేవి, వీవోఏ-5 బాణావతుల రమణమ్మల ఆధ్వర్యంలో ఉన్న 619 మంది డ్వాక్రా సభ్యులు కలిపి ఈ ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని ఏపీఎం బి. రంగారావు, సీసీ డి.విజయకుమారి చేతులమీదగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరిపరపు అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ సీయూసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, పోతల అప్పలనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, పైల హరీష్, గండి ఈశ్వరరావు, డ్వాక్రా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోటీలతో విద్యార్థుల మేధకు పదును


గ్రంథాలయంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


గ్రంథాలయ ఉద్యమ నాయకులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం


సబ్బవరం గ్రంథాలయంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొనడం ద్వారా వారి మేధస్సు వృద్ధి చెందుతుందని సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రసాద్, రామారావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సబ్బవరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం క్విజ్, చదరంగం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి. శిరీష, ఉపాధ్యాయులు పాణి, జ్యోత్స్న, మనోజ్, హరి పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు

పెందుర్తి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో జరిగిన చిత్ర లేఖన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దాదాపు 380 మంది విద్యార్థులు పాల్గొని చిత్రాలు గీశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్.జానకిరామ్ పర్యవేక్షణలో నిర్వహించిన పోటీలకు డిప్యూటీ తహసీల్దార్ శివాజీ పట్నాయక్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బి.సూర్యకళ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 'శారీరక పరిశుభ్రత', 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు 'చదవడం మాకిష్టం', సాహిత్య గోష్టి-ఇష్టాగోష్టి, ఐదోరోజు సోమవారం పుస్తక ప్రదర్శన, ఆరో రోజు మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు, ఇందిరాగాంధీ జయంతి, ముగ్గులు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆఖరి రోజు బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానం తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

గ్రంథాలయోద్యమ నాయకులకు నివాళులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయోద్యమ నాయకుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయోద్యమ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, వయోజన విద్య వ్యాప్తికి కృషి చేసిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, గ్రంథాలయ కోర్సును శాస్త్రంగా తీర్చిదిద్దిన తొలి లైబ్రేరియన్ షియాలీ రామామృత రంగనాథన్ చిత్రపటాలకు మేహాద్రిగెడ్డ గురుకుల కళాశాల లైబ్రేరియన్ ఎన్.మాధవీలత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తిదాయకంగా గ్రంథాలయ ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో గ్రంథాలయ ఉద్యమ నాయకులు కీలకపాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మికనేత సీహెచ్.సూర్యనారాయ రాజు, నేవల్ ఉద్యోగి కె.సురేష్, న్యాయవాది కె.రామకృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై ప్రత్యేక పూజలు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం నిర్వహించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం నిర్వహించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాదం, మజ్జిగ వితరణ చేపట్టారు.

సంజయ్ కుమార్ సిన్హాకు సత్కారం


సంజయ్ కుమార్ సిన్హాను సత్కరిస్తున్న భీమరాజు తదితరులు

పరవాడ: పరవాడ మండలంలో ఎన్‌టీపీసీ సింహాద్రిలో హెచ్‌వోపీగా విధులు నిర్వహిస్తున్న సంజయ్ కుమార్ సిన్హా వల్లూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ, ఎన్ఎంయూఎస్ యూనియన్ తరఫున సంజయ్ కుమార్ సిన్హాను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ బి. భీమరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీపీ లెనిన్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన అవసరం


సదస్సులో పాల్గొన్న జీవన్‌దాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రాంబాబు, కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, ఎస్‌పీఈసీటీ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి

పెందుర్తి: ప్రమాదవశాత్తు, ఇతర కారణాలతో మరణించిన వారి అవయవాలు దానం చేయడం వల్ల దాదాపు 8 మందికి మళ్లీ జన్మనిచ్చిన వారవుతారని విమ్స్ డైరెక్టర్, జీవన్‌దాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ కె.రాంబాబు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవయవదానంపై శనివారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. దాదాపు 1000 మంది విద్యార్థులు పెందుర్తి కూడలి నుంచి పాత ప్రభుత్వాసుపత్రి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవయవదానంపై పూర్తిస్థాయి అవగాహన అవసరం అన్నారు. జీవించిన కాలంలో ఎలా అయితే సమాజానికి, కుటుంబానికి ఆసరాగా ఉంటామో.. మరణం తరువాత కూడా సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. అవయవదానంపై పలువురు వక్తలు అవగాహన కలిగించారు. ఎస్‌పీఈసీటీ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి, అవయవదాత సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ వి.వినోద్‌బాబు, జి.వి.ఎల్.కిరణ్, నాయకులు దాడి రమణచిట్టి, వేగి దివాకర్, దాడి సురేష్, పెతకంశెట్టి ఉమాశంకర్, చారిటీ ప్రతినిధులు సిరిమల్ల గణేష్, కందుల నవీన్, కె.సూర్య, పి.కిషోర్, సురేష్, డి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అవయవదాన అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

'ఉల్లాస్' విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరావు

పెందుర్తి: బడికి వెళ్లే వయసులో చదువుకోలేకపోయిన డ్వాక్రా సంఘాల మహిళలకు చదువు చెప్పే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఉల్లాస్ పథకం మండలంలో విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరావు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ వలంటీర్లకు శనివారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎస్‌హెచ్‌జీలో నిరక్షరాస్యులకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. మండలంలో మొత్తం 864 మంది నిరక్షరాస్యులైన ఎస్‌హెచ్‌జీ సభ్యులను గుర్తించామని, వారికి చదువు నేర్పేందుకు 86 మంది వలంటీర్లను ఎంపిక చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ డీడీ సుబ్రహ్మణ్యవర్మ, ఏపీఎం రేణుక, అధికారులు, వెలుగు సిబ్బంది, ఉల్లాస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం


గౌరీ పరమేశ్వరుల ఊరేగింపులో కోలాటమాడుతున్న మహిళలు


గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో గండి రవికుమార్ తదితరులు

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెంలో గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆదిదంపతులకు ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నసమారాధనలో దాదాపు 1500 మంది ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఊరేగింపు సందడిగా సాగింది. మహిళలు కోలాటం ఉత్సాహభరితంగా జరిగింది. అనంతరం గ్రామంలోని భక్తులు రకరకాల పిండివంటలు, ఫలాలతో గౌరమ్మకు సారె సమర్పించారు. భక్తిశ్రద్ధలతో గౌరీ పరమేశ్వరులను నిమజ్జనం చేశారు. గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బొండవానిపాలెంలో ప్రత్యేక పూజలు

సబ్బవరం: మండలంలోని గొటివాడ శివారు బొండవానిపాలెం గ్రామంలో గౌరీ పరమేశ్వరులను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ శనివారం దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. ఆయనతో పాటు సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, గొటివాడ ఉపసర్పంచ్ జి. ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన


కార్మికులకు,సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కమాండర్ వై సత్యనారాయణ

పరవాడ: పరిశ్రమలలో ప్రమాదాలు నివారించడానికి, అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎదుర్కోవడానికి కార్మికులు అవగాహన ఉండాలని జాతీయ విపత్తు స్పందన దళం 10వ బెటాలియన్ టీం కమాండర్ వై.సత్యనారాయణ తెలిపారు. పరవాడలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, సువెన్ ఫార్మా కర్మాగారాల్లో శనివారం సిబ్బందికి, కార్మికులకు ప్రమాదాల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, తక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.

అప్పన్న సన్నిధిలో భారత ప్రభుత్వ కార్యదర్శి


సుగతా ఘోష్ దస్తిదార్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని భారత ప్రభుత్వ కార్యదర్శి, డిఫెన్స్ సర్వీసెస్ ఆర్థిక సలహాదారు సుగతా ఘోష్ దస్తిదార్ శనివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని సూపరింటెండెంట్ ప్రసాద్ అందించారు.